RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | గురువారం 28 నవంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 199 | పేజీలు: 4 | వెల: రూ.5/-




## ఇస్రో శుక్రయాన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

2లో..

# విద్యా మంత్రి లేకనే అనర్థాలు

- మాగనూర్ ఫుడ్ పాయిజన్‌పై హైకోర్టు సీరియస్
- అధికారులకు పిల్లలు లేరా అంటూ హైకోర్టు ఘాటుగా మందలింపు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేరుకొని వెంటనే విద్యామంత్రిని ఏర్పాటు చేయాలి
- ఈ ఘటనే మొదటిది, చివరిది కావాలి
- విద్యామంత్రికై విద్యార్థుల తల్లిదండ్రుల మూకుమ్మడి డిమాండ్





ప్రభాత సూర్యుడు కస్బా విద్యా వార్త

**హైదరాబాద్-ప్రభాత సూర్యుడు:** నారాయణపేట జిల్లా మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారం వ్యవధిలో మూడుసార్లు భోజనం వికటిస్తే అధికారులు నిద్రపోతున్నారా? అంటూ హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే అసహనం చేస్తూ, ఘాటుగా మందలిస్తూ ఇది చాలా సీరియస్ అంశమని సీజే ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా, ఫుడ్ పాయిజన్ పై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం పై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతే కానీ స్పందించరా? అంటూ హైకోర్టు సీజే ధర్మాసనం ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సంఘటనపై వారంలోగా కౌంటర్ దాఖలు చేస్తామన్న ప్రభుత్వ న్యాయవాది పై హైకోర్టు సీజే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఉండే అధికారిని సంప్రదించి వివరాలు సేకరించడానికి వారం వ్యవధి ఎందుకని సీజే ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాలు ఇస్తేనే అధికారులు పనిచేస్తారా? అంటూ ఆగ్రహించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే 5 నిమిషాల్లో అధికారులు హాజరవుతారని చురకలు అంటించారు. అధికారులకు కూడా పిల్లలు ఉన్నారు కదా? అని ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం గుర్రుమని గుర్తు చేసింది. అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఉన్నత న్యాయస్థానం చెప్పింది. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులు అనే అర్థం వచ్చేటట్లు హైకోర్టు అధికారులకు గడ్డి



పెట్టింది.. భోజన విరామం తర్వాత ఈ ఘటన కు సంబంధించిన పూర్తి వివరాలు అందిస్తామని హైకోర్టుకు ఏఏజీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తరచూ భోజనం వికటిస్తోందని హైకోర్టు కు చిక్కుడు ప్రభాకర్ తెలిపారు. ఇంత హృదయ విషాదకర సంఘటన జరిగిన తర్వాత కూడా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖకు విద్య మంత్రిని నియమించాలనే ఆలోచన రావాలని విషాహారం తిని అశ్వస్తతకు గురి అయిన విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకొంటుండడం కొసమెరుపు. ప్రభాత సూర్యుడు పత్రిక సైతం గతంలోనే విద్యాశాఖ కు విద్యామంత్రి లేక "బోసిపోతున్న తెలంగాణ విద్యారంగం" అంటూ ప్రభాత సూర్యుడు ప్రభుత్వాన్ని మేల్కొలిపిన విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తిస్తూ, మరొకసారి ఆలోచించి తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖకు విద్యామంత్రిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై సహచర మంత్రుల బృందం ఒత్తిడి పెట్టక తప్పదని 'ప్రభాత సూర్యుడు' పత్రిక సూచిస్తుంది.



# మహా సీఎంపై మోదీ నిర్ణయమే ఫైనల్

## మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు

### ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు

**ముంబై, (ప్రభాత సూర్యుడు):** మహారాష్ట్రలో సీఎం పదవిపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, రాష్ట్రపు అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన తనకు ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవిపై ఎలాంటి నిర్ణయమైనా ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిర్ణయమే తుది నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. బుధవారం థానేలో తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు."పోరాటం నా రక్తంలో ఉందని ఏక్‌నాథ్ చెప్పారు.మహాయుతి గెలుపు కోసం ఆయన పలు సంవత్సరాల పాటు కార్యకర్తగా పనిచేసినట్లు పేర్కొన్నారు.నేను ఒక కార్యకర్తగా పని చేసి ఒక కార్యకర్తలా చెప్పులు అరిగేలా తిరిగానని పేర్కొన్నారని తెలిపారు. పార్టీకి వచ్చిన విజయం గురించి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు మహావికాస్ అఘాడీ కూటమిని తిరస్కరించిన విషయం మీద శింధే వ్యాఖ్యానించారు. మా దృష్టిలో ముఖ్యమంత్రి అంటే ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తి," అని ఆయన చెప్పారు. తాను ఎప్పటికీ అధికారికంగా ఒక ముఖ్యమంత్రిగా ప్రవర్తించలేదని, ఒక సాధారణ వ్యక్తిగా ప్రజల మధ్య తిరిగానని చెప్పారు. ఆయన ఒక రైతు కుటుంబం నుండి వచ్చారని, పేదల కష్టాలను బాగా అర్థం చేసుకునే వ్యక్తిగా ఉన్నారని వెల్లడిరచారు. జీవితంలో ఎన్నో అడ్డంకులు చూశానని ఆయన తెలిపారు. మహారాష్ట్ర అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, బాల్ థాక్రే ఆశయాలను కొనసాగించగలిగే విధంగా పని చేస్తానని పేర్కొన్నారు. ఆయనకు ప్రధాని మోదీ నుండి పూర్తిగా మద్దతు ఉందని అన్నారు. ప్రమోషన్ల కోసం అనవసరంగా వార్తల్లో ఉండాలని నాకు అభిరుచి లేదు," అని స్పష్టం చేశారు. తన సహచర మంత్రులతో కలిసి తాను 24/7 పనిచేశామని, ఇకపై ముఖ్యమంత్రిగా ఎవరు నియమించబడతారో బీజేపీ హైకమాండ్‌నే నిర్ణయించాల్సి ఉందని చెప్పారు.ముఖ్యమంత్రి పదవిపై మోదీ,అమిత్ షా వారు తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని, ఎవరైనా నిర్ణయం తీసుకున్నా, నేను అది అంగీకరించి, వారికోసం పని చేస్తానని అన్నారు.

# మోదీతో తెలంగాణ భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశం



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ప్రధాని మోదీ. తెలంగాణలో భాజపా వేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రానికి చెందిన భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం అయ్యారు. దిల్లీ: తెలంగాణలో భాజపా వేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రానికి చెందిన భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. పార్లమెంట్‌లోని తన కార్యాలయంలో తెలంగాణ భాజపా నేతలతో ప్రధాని ప్రత్యేకంగా సమావేశమై.. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం సమావేశం ఫొటోలతో మోదీ 'ఎక్స్'లో తెలుగులో పోస్టు పెట్టారు. "తెలంగాణ భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం చాలా బాగా జరిగింది. రాష్ట్రంలో మా పార్టీ ఉనికి వేగంగా విస్తరిస్తోంది. తెలంగాణ ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌తో విసిగిపోయారు. భారాస దుష్టపాలన వల్ల కలిగిన భయంకరమైన జ్ఞాపకాలతో ఉన్నారు. ఎంతో ఆశతో భాజపా వైపు చూస్తున్నారు. కాంగ్రెస్, భారాస ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భాజపా తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తూనే ఉంటుంది. మా కార్యకర్తలు మా అభివృద్ధి ఎజెండాను వివరిస్తూనే ఉంటారు" అని మోదీ పేర్కొన్నారు.

## భారత్‌ను బాల్య వివాహాల విముక్త

# సమాజంగా నిర్మిద్దాం




స్పందన కల్చరల్, ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్( స్కోప్) సంస్థ చైర్మన్ బండి సాయన్న ప్రసంగిస్తున్న దృశ్యం

## డాక్టర్ బండి సాయన్న

ప్రభాత సూర్యుడు కస్బా వార్త

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** దేశంలో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టి, ఈనాటి బాలలే రేపటి భావి భారత పౌరులు అన్న విషయాన్ని భారత సమాజానికి తెలువాల్సిన అవసరం ఉన్నదని డాక్టర్ బండి సాయన్న అన్నారు. తెలంగాణ లోని జనగామ జిల్లా పెంబర్తి గ్రామ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల మరియు జూనియర్ కాలేజీ నందు బుధవారం దేశంలో జరుగుతున్న బాల్య వివాహాల అనర్థాల సదస్సు లో డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ కుటుంబాలలో బాల్య వివాహాలతో నానా అనర్థాలు ఏర్పడనున్నయని అందుకే బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. స్పందన కల్చరర్, ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్, (స్కోప్) సంస్థ చైర్మన్ డాక్టర్ బండి సాయన్న అన్నారు. వయసు రీత్యా చిన్న వయస్సులో వివాహాలు జరిగితే శారీరకంగా, మానసికంగా పిల్లల ఎదుగుదల ఉండదని, చిన్న వయస్సులోనే అనారోగ్యాలకి గురి అవుతారని అన్నారు. 2006 బాల్యవివాహాల నిరోధక చట్టం పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సదస్సులో డి ఎల్ ఎస్ ఏ సెక్రెటరీ విక్రం మాట్లాడుతూ తెలంగాణ లోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న జనగామ జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా ఏర్పాటు చేసుకుందామని అన్నారు. డీ డబ్ల్యు ఓ ప్రతినిధి మేడమ్ ఫ్లోరెన్స్

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# అదానీ వ్యవహారంపై అట్టుడికిన పార్లమెంటు



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** అదానీ వ్యవహారం రెండో రోజు పార్లమెంటును కుదిపేసింది. అమెరికాలో అదానీ సంస్థపై నమోదైన కేసు, ఈ సంస్థపై వచ్చిన ఆరోపణలపై చర్చకు ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసపైనా చర్చించాలని డిమాండ్ చేశారు. దీంతో ఉభయసభలు గురువారానికి వాయిదా పడ్డాయి. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా.. ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. దీంతో ప్రతిపక్షాల సభ్యులు అదానీ, సంభాల్ హింసపై చర్చించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో సభను 12 గంటలకు వాయిదా వేశారు. సభ ప్రారంభమయ్యాక కూడా నినాదాలు కొనసాగడంతో సభ గురువారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో సభను ఒక రోజు వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ప్రకటించారు.

# భారత్‌ను బాల్య వివాహాల విముక్త సమాజంగా నిర్మిద్దాం



జనగామలో బుధవారం జరిగిన బాల్య వివాహాల అనర్థాల నిర్మూలన సదస్సుకు హాజరైన విద్యార్థిని విద్యార్థులు

**మొదటి పేజీ తరువాయి...**

మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరుగుతున్న అనర్థాలపై మాట్లాడుతూ విద్య నేర్చుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులు బాలల హక్కులు వారి బాధ్యతను తెలుసుకుని, తమ భవిష్యత్తును ఉన్నతంగా రూపొందించుకోవాలని అన్నారు. సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ ఉప్పలయ్య మాట్లాడుతూ బాల్యంలో విద్య పై దృష్టి పెట్టాలనీ, చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలని ఎంచుకున్న లక్ష సాధనకై, కృషి చేయాలని బాల్యవివాహాల నిర్మూలనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. బాలల పరిరక్షణ అధికారి ఎల్ రవి కాంత్ మాట్లాడుతూ పెద్దలు చెప్పిన మాటలను అర్థం చేసుకుని మీ భవిష్యత్తును మీరే నిర్ణయించుకోవాలని అన్నారు. బాల్య వివాహాల అనర్థాల సదస్సులో చైల్డ్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ రవికుమార్, విద్యాశాలల ప్రిన్సిపల్ రుక్సాన, స్కోప్ ఎన్జీవో జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రవీందర్, మనోజ్ కుమార్, నాదృత బస్సు, తరుణ్, పద్మ, లావణ్య మరియు గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు ఈ సమావేశంలో బాల్యవివాహాల నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని వచ్చిన అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడం గమనార్హం.

## ఇస్రో శుక్రయాన్‌కు
# కేంద్రం గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టబోతున్నది. వీనస్‌తో పాటు గగన్‌యాన్, చంద్రయాన్-3 ప్రాజెక్టులకు సిద్ధమవుతున్నది. 2028లో ఇస్రో శుక్రయాన్ మిషన్ ప్రయోగించనుండగా.. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ఇస్రో డైరెక్టర్ నీలేశ్ దేశాయ్ తెలిపారు. సింథటిక్ ఎపర్చర్ రాడార్, అల్ట్రావైలెట్ ఇమేజింగ్ సిస్టమ్ తదితర అత్యాధునిక టెక్నాలజీతో కూడిన పరికరాలతో శుక్రుడి వాతావరణంపై పరిశోధన జరుపనున్నది. దట్టమైన కార్బన్‌డయాక్సైడ్, సల్ఫ్యూరిక్ ఆమ్లం, క్రియాశీల అగ్నిపర్వతాలను గుర్తించడంతో పాటు గ్రహం భౌగోళిక కార్యకలాపాలను అంచనా వేయడం మిషన్ ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. చంద్రయాన్-3 విజయం తర్వాత.. జపాన్‌తో కలిసి చంద్రయాన్-4 ఇస్రో చేపట్టనున్నది. ఈ ప్రాజెక్టులో చంద్రుడిపై మట్టి, రాతి నమూనాలను సేకరించి తిరిగి భూమిపైకి చేరుకునేలా ప్రయోగం చేపట్టబోతున్నది. ఈ మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపితే, 2030 నాటికి మిషన్‌ను నిర్వహించగలుగనున్నట్లు నీలేశ్ దేశాయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మిషన్ శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించారు. మార్స్ ఆర్బిటర్ మిషన్ (మంగళ్‌యాన్) సాధించిన విజయాల ఆధారంగా ఇస్రో మార్స్ ప్రోగ్రామ్‌ను సైతం విస్తరిస్తున్నది. రాబోయే దశలో రెడ్ ప్లానెట్ చుట్టూ పరిభ్రమించడంతో పాటు ఉపరితలంపై ల్యాండిరగ్‌కు ప్రయత్నించనున్నట్లు పేర్కొన్నారు. మార్స్ మిషన్‌లో ఓ ఉపగ్రహాన్ని అంగారకుడి కక్ష్యలో ఉంచడంతో పాటు ఉపరితలంపై ల్యాండిరగ్‌కు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఆ గ్రహంపై మరింత లోతుగా అధ్యయనం చేస్తామన్నారు. అలాగే, గగన్‌యాన్‌లో కీలకమైన మైలురాయిని చేరుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. తొలిసారిగా గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఆస్ట్రోనాట్స్‌ని అంతరిక్షంలోకి తీసుకువెళ్లనున్నది. రాబోయే రెండేళ్లలో మిషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌శాట్-4ని భాగంగా వాతావరణ, సముద్రంపై పరిశోధనలను మెరుగుపరిచేందుకు కొత్త సెన్సార్లతు ఉపగ్రహాలను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌శాట్-4 సిరీస్‌లో భాగంగా ప్రయోగించనున్న కొత్త సెన్సార్లు, ఉపగ్రహాలపై చర్చలు జరుపుతున్నామన్నారు. ఇక తొలిసారిగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికలకు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది ఐఎస్ఎస్ కంటే చిన్నగా ఉంటుంది. ఇస్రో స్పేస్ సెంటర్‌లో ఐదు మాడ్యూల్స్ ఉంటాయి. తొలి మాడ్యూల్ 2028లో ప్రారంభించనున్నారు. పూర్తి స్టేషన్ నిర్మాణం 2035 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.



# ప్రజాపాలన అంటే నిర్బంధాలా?

## నిర్బంధాలతో ఉద్యమాలు ఆగుతాయా?
## కాంగ్రెస్ పాలనను ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** ప్రజాపాలన అంటూ చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలతో పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బందిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటులను అణిచివేయాలనుకోవడం మూర్కత్వమన్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. దీంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# రైతులను దగా చేసినందుకు పండుగ చేస్తున్నావా

## రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన విజయోత్సవాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో రైతులను విజయవంతంగా దగా చేసినందుకు రైతు పండుగ అంటూ మూడు రోజుల విజయోత్సవాలు చేస్తున్నావా అని ప్రశ్నించారు. గొప్పగా చెప్పిన వరంగల్ రైతు డిక్లరేషన్‌లోని 9 హామీల్లో ఒక్కటీ అమలు చేయనందుకు పండుగ చేస్తున్నావా అని మండిపడ్డారు. రుణమాఫీ ఎగ్గొట్టి, రైతు భరోసా బోగస్ చేసి, కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు చేయకుండా రైతులను ఏడ్పిస్తున్నందుకు చేస్తున్నావా అని నిలదీశారు. మీ ఏడాది దుర్మార్గ పాలనలో 563 మంది రైతులు ప్రాణాలు కోల్పోయినందుకు పండుగ చేస్తున్నావా అని మండిపడ్డారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టాడని.. అధికారంలోకి వచ్చాక నిండా ముంచాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు పథకానికి ఎగనామం పెట్టారని అన్నారు. నూటొక్క దేవుళ్ల మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చేస్తానని మోసం చేశారని అన్నారు. సగం మందికి మొండి చెయ్యి చూపారని విమర్శించారు. 24 గంటల నాణ్యమైన కరెంటు అందించలేక చేతులెత్తేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర లేదని.. అన్ని పంటలకు బోనస్ అసలే లేదని.. పత్తి అయినా, ధాన్యం అయినా కొనుగోలు కేంద్రాలు లేవని అన్నారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇస్తానన్న భరోసా దిక్కులేదని విమర్శించారు. ఈ ఏడాది పాటు రైతులకు మీరు చేసిన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు రైతు పండుగ నిర్వహించడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. పైగా, ఏడాది పాలనలో రైతు సంక్షేమం కోసం 54,280 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. రైతు బీమా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్ల కోసం మీరు ఖర్చు చేసినా అని చెప్పిన రూ. 27,486 కోట్లు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చేసిందని తెలిపారు. ఏ ప్రభుత్వం ఉన్నా చేయాల్సి ఉంటుందే అని చెప్పారు. కానీ, కొత్తగా తామేదో రైతులకు చేసినట్లు డబ్బా కొట్టుకోవడం రైతులను మరోసారి మోసం చేయడమే అని అన్నారు. ఇదేనా కాంగ్రెస్ మార్కు మార్పు అని ప్రశ్నించారు. మీ మేనిఫెస్టో ప్రకారం రైతులకు పడిన బాకీ రుణమాఫీ కింద దాదాపు 14,000 కోట్లు.. ఖరీఫ్ రైతు బంధు కింద 7,500 కోట్లు.. కౌలు రైతులకు మరో 3,000 కోట్లు.. రైతు కూలీలకు 1600 కోట్లు.. అన్ని పంటలకు బోనస్ సుమారు 3,000 కోట్లు అకాల వర్షాలకు గానూ పంట నష్టం సుమారు 11,700 కోట్లు (కేంద్రానికి రాష్ట్రం పంపిన రిపోర్టు).. ఇలా ఈ ఏడాది కాలంలో మొత్తం రూ. 40,800 కోట్లు రైతులకు బాకీ పడ్డారని హరీశ్‌రావు తెలిపారు. మీకు, మీ పార్టీకి రైతుల సంక్షేమం పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. రైతులకు బాకీ పడ్డ రూ. 40,800 కోట్లతో పాటు, ఈ రబీకి ఇవ్వాల్సిన రైతు భరోసా కూడా వెంటనే విడుదల చేసి పండుగ చేసుకోవాలని డిమాండ్ చేశారు.



# పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు

## నాటి ప్రభుత్వంలో ఠంచన్ వచ్చేది..
## కాంగ్రెస్ హయాంలో 20 దాటినా రాని పరిస్థితి
## ట్విటర్ వేదికగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** మాజీ సీఎం కేసీఆర్ పాలనలో వృద్ధులు ఎవరి మీద ఆధారపడకుండా మందు బిళ్లలు, ఇంటి నిత్యావసరాలు పింఛన్ డబ్బులతో తెచ్చుకునేవారని, కానీ కాంగ్రెస్ పాలనలో అది సాధ్యం కావడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఏలుబడిలో వృద్ధులు పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్నారన్నారు. నెలానెలా సరైన సమయంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో చోట పింఛన్ల కోసం రోడ్డెక్కుతున్న ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో పింఛన్ వృద్ధులు రోడ్డెక్కి వెంటనే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నెలనెలా సక్రమంగా పింఛన్ వచ్చేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీసుల్లో ఇచ్చేవారని.. నవంబర్ 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లోనే వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు. తెలంగాణాలో పింఛన్ల కోసం కోసం వృద్దులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు.. టంచన్‌గా అకౌంట్లో పడే పడే పైసలు ఆగిపోతాయని ఎవరునుకున్నారు? అన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లాక్షా యాభై వేల కోట్లు వెదజల్లి.. కనికరం లేకుండా వృద్ధుల పెన్షన్ డబ్బులను ఆపుతారని అనుకున్నారన్నారు. మందుబిల్లల కోసం కొడుకులు, కోడళ్ల దగ్గర చేయిచాచే అవసరమే లేని రోజుల నుంచి మళ్లీ వేడుకునే 'మార్పు' వస్తుందని ఎవరు ఊహించారని.. అణువణువునా కర్కశత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా ఇక్కట్లే ఉంటాయని ఎవరనుకున్నారు..? మార్పు ఇంత మోసగిస్తుందని ఎవరనుకున్నారు? అంటూ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

# మెడికల్ ఆఫీసర్ తొలగింపు

## ముగ్గురు సిబ్బందిపై వేటు



**లక్నో, (ప్రభాత సూర్యుడు):** ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ ఆస్పత్రిలో జరిగిన అగ్నిప్రమాదంలో పది మంది శిశువులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ ఘటనపై ఆ రాష్ట్ర సర్కారు చర్యలు తీసుకున్నది. ఝాన్సీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర సింగ్ సెంగార్‌ను తొలగించారు. ఆ కాలేజీకి చెందిన మరో ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. నవంబర్ 15వ తేదీ జరిగిన ప్రమాదానికి చెందిన నివేదికను నలుగురు సభ్యుల కమిటీ ఇచ్చింది. డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ ఈ చర్యలు తీసుకున్నారు. ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ బాధ్యతలు ఆయనే చూసుకుంటున్నారు. కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా మహారాణి లక్ష్మీ భాయ్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను తొలగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వేటుకు గురైన ముగ్గురు సిబ్బందిలో.. ఓ చీఫ్ సూపరింటెండెంట్, జూనియర్ ఇంజినీర్, వార్డు నర్సు ఉన్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీర్ సంజీత్ కుమార్, ఎన్ఐసీయూ వార్డు ఇంచార్జ్ నర్సు సంధ్యా రాణి, చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ సునితా రాథోడ్‌పై వేటు వేశారు.

# రోప్‌వే ప్రాజెక్టుపై ఆందోళన

**శ్రీనగర్, (ప్రభాత సూర్యుడు):** జమ్మూకశ్మీర్‌లోని కాట్రా బేస్ క్యాంప్ వద్ద రోప్‌వే ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. ట్రెక్కింగ్ రూట్‌లో ఆ రోప్‌వే నిర్మించాలనుకున్నారు. కానీ రియాజీ జిల్లాకు చెందిన కార్మికులు, షాపు ఓనర్లు.. ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు 8 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భూపిందర్ సింగ్, సోహన్ చాంద్ నేతృత్వంలోని ఆందోళనకారులు.. ప్రతిపాదిత రోప్‌వే ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అయితే వాళ్లను పోలీసులు అడ్డుకోవడంతో.. ఘర్షణలు తలెత్తాయి. సింగ్, చాంద్‌ను అరెస్టు చేశారు. సోమవారం జరిగిన ఘర్షణకు చెందిన ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ప్రదర్శన చేపట్టారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# హైదరాబాద్ నగరంలోని చెరువులపై పూర్తి పర్యవేక్షణ మాదే : హైకోర్టు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): హైదరాబాద్‌లోని అన్ని చెరువులకు సంబంధించి పూర్తి పర్యవేక్షణ తమదేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. రామమ్మ చెరువు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. హెచ్‌ఎండీఏ పరిధిలో 3 వేల 532 చెరువులు ఉన్నాయని జులైలో జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వం తెలపగా వాటన్నింటికీ బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధరించాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ డిసెంబర్ 30కి వాయిదా.. విచారణకు హాజరైన హెచ్‌ఎండీఏ కమిషనర్ ఇప్పటివరకు 2,793 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ చేసినట్లుగా తెలిపారు. 530 చెరువులకు సంబంధించి తుది నోటిఫికేషన్లు పూర్తయినట్లుగా వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలోని అన్ని చెరువులకు ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్ జోన్లను నిర్ధరిస్తూ తుది నోటిఫికేషన్ జారీకి 3 మాసాల సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టును కోరగా అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి విచారణను డిసెంబరు 30వ తేదీకి వాయిదా వేసింది.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం

# పోలీసుల విశ్వ ప్రయత్నాలు

## తిరుపతన్న బెయిల్ పిటిషన్ డిసెంబర్ 18వ తేదీకి వాయిదా



న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి దుమారాన్ని రేపిందో అందరికీ తెలిసిందే. ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీసు అధికారులు బెయిల్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారికి ప్రతీసారీ నిరాశే మిగులుతోంది. ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీస్ అధికారి తిరుపతన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం అదనపు ఎస్పీ తిరుపతన్న సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరింది. దీంతో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కౌంటర్ దాఖలుకు రెండు వారాల సమయం ఇస్తూ.. తదుపరి విచారణ డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ తిరుపతన్నను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయగా.. అందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. తిరపతన్నకు బెయిల్ రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే హైకోర్టు బెయిల్ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం (అక్టోబర్ 24న) న్యాయస్థానం విచారణ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న , జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఛార్జ్‌షీట్ ఫైల్ చేసి మూడు నెలలు అయిన తర్వాత కూడా హైకోర్టు బెయిల్ ఎందుకు నిరాకరించిందని ధర్మాసనం ప్రశ్నిస్తూ.. తరుపరి విచారణను నవంబర్ 27కు వాయిదా వేసింది. ఈరోజు విచారణ జరిపిన సుప్రీం కోర్టు తదుపరి డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న తిరుపతన్నకు ఇటీవల హైకోర్టు బెయిల్ రద్దు చేసిన విషయం తెలిసిందే. తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం నిరాకరించింది. తిరుపతన్న ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్న నేపథ్యంలో బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. కేసు విచారణ కీలక దశలో ఉన్న సమయంలో బెయిల్ ఇస్తే... దాన్ని వల్ల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. పోలీసుల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఫోరెన్సిక్ ల్యాబరేటరీ నివేదిక ప్రకారం దర్యాప్తు చేయాలని ఖాకీలను కోర్టు ఆదేశించింది. అలాగే తిరుపతన్నకు బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేస్తూ.. ఈ కేసును హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైకోర్టును తీర్పును సవాల్ చేస్తూ తిరుపతన్న సుప్రీంను ఆశ్రయించారు.



### కామ్రేడ్ కోటు ప్రసాద్ మరణం

# తీరని లోటు

## సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్ర చారి

అబ్దుల్లాపూర్ మెట్- ప్రభాత సూర్యుడు: ఖమ్మం జిల్లా సిపిఐ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ.. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏ ఐ టి సి రాష్ట్ర నాయకులు పోటు ప్రసాద్ బుధవారం ఉదయం ఆకస్మిక మరణం దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రోజు రవీంద్ర చారి విచారం వ్యక్తం చేశారు. పోటు ప్రసాద్ లేనిలోటు తీరనిదని పేర్కొన్నారు. బుధవారం కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ పార్టీ కార్యాలయంలో సిపిఐ నాయకులు పోటు ప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ..రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ లో పనిచేసి విద్యార్థి ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా పోటు ప్రసాదు కీలకంగా పనిచేశారని. హైదరాబాదులో జరిగిన విద్యుత్ ఉద్యమం పోరాటంలో పోలీసుల దెబ్బలు, గుర్రాలతో తొక్కించి గాయపరిచినా ఆ రోజుల్లో ధైర్యంగా పోలీసులని ఎదుర్కొని అరెస్టయ్యారని అన్నారు. అలాగే భూ సమస్య పైన కామ్రేడ్ నారాయణ, కామ్రేడ్ రాఘవులు నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో ఖమ్మంలో భూ పోరాటంలో పాల్గొని పోలీసులతో దెబ్బలు తిని రక్తం కారుతున్నా వెనుతిరగకుండా పోరాటం చేసిన యోధుడని వివరించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల యాదిరెడ్డి పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్ నాయక్, తగిలి మధు,పుల్లయ్య, ప్రసాద్,నిరంజన్, యాదగిరి, దేవమ్మ, సుజాత వినోద్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం

### బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శనకు వెళ్తారనే అనుమానంతో బుధవారం తెల్లవారు జామున మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన నేతలను అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు నారాయణపేట పోలీసులు తరలించారు. మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫాయిజన్‌తో విద్యార్థులు అవస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి.. ఠాణాకు తరలించారు. పోలీసుల అత్యుత్సాహంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఈ నెల 30 నుంచి రాష్ట్రవ్యాప్తంగా

# బీఆర్ఎస్ గురుకుల బాట: కేటీఆర్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాలు, పాఠశాలల్లో నెలకొన్న దుస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని మండిపడ్డారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నేతలు పరిశీలించనున్నారని తెలిపారు. గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. 11 నెలల్లో 52 మంది విద్యార్థుల మరణించారని.. ఇందులో 38 ఫుడ్



పాయిజన్ సంఘటనలు ఉన్నాయని తెలిపారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో ముఖ్యమంత్రివిద్యార్థులను పొట్టన బెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేడని.. ముఖ్యమంత్రికి ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోతలేదని విమర్శించారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని అన్నారు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున అధ్యయన కమిటీ వేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేశామని చెప్పారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా గురుకుల బాట కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ అధ్యయన కమిటీ బీఆర్ఎస్ పార్టీకి నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. ఈ నివేదిక అంశాలను శాసనసభలో లేవనెత్తుతామని స్పష్టం చేశారు.

# ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయండి: ప్రభుత్వం ఆదేశం

## దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు





నిర్మల్ (ప్రభాత సూర్యుడు): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇథనాల్ పరిశ్రమ అనుమతులు, షరతులు, స్థానికుల ఆందోళనపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కు నివేదిక ఇచ్చారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతులను పునః సమీక్షించాలని సర్కారు నిర్ణయించింది. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని స్థానికంగా ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. అవసరమైతే పరిశ్రమ అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. తాజాగా ప్రభుత్వ సూచనల మేరకు ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అంతకముందు ఇవాళ ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ గ్రామస్థులు చేపట్టిన నిరసనలో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. ఆందోళనకారులు పోలీసులపై దాడి చేయగా వారు పరుగులు తీశారు. ఈ ఆందోళనలో మహిళలు సైతం పురుగుల మందు డబ్బాలు పట్టుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలంటూ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవంబర్ 26న కూడా జాతీయ రహదారిపై రాస్తారోకో చేయగా అక్కడికి వచ్చిన ఆర్డీవోను అడ్డుకుని కారు దహనానికి యత్నించారు. దీంతో కొద్దిసేపటి వరకు అక్కడ ఉద్రిక్తతకు దారితీసింది.

ఆందోళన విరమించిన గ్రామస్థులు : మంగళవారం సాయంత్రం వరకు గ్రామస్థులు రహదారిపైనే వంటావార్పు నిర్వహించి అక్కడే భోజనం చేశారు. రాత్రి కూడా సెల్‌ఫోన్ల వెలుతురులో సైతం నిరసన కొనసాగించారు. ఈ నేపథ్యంలో గ్రామస్థుల ఆందోళనలపై స్పందించిన కలెక్టర్ సీఎం కార్యాలయం(సీఎంవో)కు నివేదిక పంపినట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఆందోళనకారులు సైతం నిరసన విరమించి ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

గత కొన్ని నెలలుగా నిరసనలు : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని గత కొన్ని నెలలుగా స్థానిక ప్రజలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే తమ పంట పొలాలతోపాటు పాటు అక్కడి పర్యావరణం సైతం దెబ్బతింటుందని గ్రామస్థులు వాపోయారు. ఈ నిరసనలో చిన్నారులు, వృద్ధులు మహిళలు సైతం పాల్గొన్నారు. ప్రస్తుతానికి ఆందోళన విరమించిన గ్రామస్థులు, ప్రభుత్వం నిర్ణయంపై తదుపరి కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# సీఎం పదవి దక్కకపోతే.. ప్లాన్ బీ అమలు

## ప్రయత్నాలు ముమ్మరం చేసిన షిండే వర్గం

**ముంబై, (ప్రభాత సూర్యుడు):** మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా తేలలేదు. నాలుగు రోజులుగా ఈ అంశంపై తీవ్రంగా చర్చ నడుస్తోంది. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఓవైపు బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకున్న నేపథ్యంలో తమ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్‌కు ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. మరోవైపు.. షిండే నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో తమ కూటమి గెలుపొందినందున ఏక్‌నాథ్ షిండేనే ముఖ్యమంత్రిగా కొనసాగించాలని శివసేన కార్యకర్తలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసక్తికర విషయం ఒకటి ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. సీఎం పదవి దక్కని పక్షంలో షిండే వర్గం ప్లాబ్-బీని సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఏక్‌నాథ్ షిండేని ముఖ్యమంత్రిని చేయకపోతే.. హోంశాఖ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు సమాచారం. మంగళవారం అర్ధరాత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో షిండే వర్గం నేతలు జరిపిన సమావేశంలో ఈ డిమాండ్‌ను ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. దీంతోపాటు మరికొన్ని వార్తలు కూడా ప్రచారంలో ఉన్నాయి. రెండు రోజుల క్రితం దేవేంద్ర ఫడ్నవీస్‌కు జాతీయ స్థాయిలో కీలక పదవి వస్తుందని ప్రచారం జరిగింది.

# విశాఖ రైల్వే జోన్ వల్ల ఎన్ని ఉద్యోగాలు వస్తాయి?

విశాఖపట్నం కేంద్రంగా ఉన్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి రైల్వేశాఖ టెండర్లను ఆహ్వానించింది. అర్హత కలిగిన సంస్థలు డిసెంబర్ 27లోగా టెండర్లు దాఖలు చేయాలని ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. టెండర్లు దక్కించుకున్న సంస్థలు రెండేళ్లలో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపింది. ఎన్నో ఏళ్లుగా విశాఖ రైల్వే జోన్ కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. ఇప్పుడు దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణం కోసం టెండర్ల ఆహ్వానించడం వరకు పక్రియ వచ్చింది. టెండర్ల పక్రియ మొదలు కావడంతో ఇక రైల్వే జోన్ పనులు మొదలైనట్లేనా? రైల్వే జోన్ పనులు మొదలవ్వడమంటే పెద్ద పెద్ద కార్యాలయాలు కట్టి, ఆ తర్వాత పనులు ప్రారంభించడం కాదు. విశాఖలోని వాల్తేరు రైల్వే డివిజన్‌కు అనేక స్థలాలు, భవనాలు ఉన్నాయి. వాటిలో మొదలు పెట్టినా చాలు. ఏదీ ఏమైనా దక్షిణ కోస్తా రైల్వే పనులకు టెండర్లను పిలిచే వరకు ప్రస్తుతం అడుగు పడింది కాబట్టి, అనుకున్న సమయానికి పనులు పూర్తయ్యేటట్లు చూస్తే చాలు. కార్యాలయాల నిర్మాణానికి రెండేళ్ల గడువు విధించింది రైల్వేశాఖ. కానీ ఆ తర్వాత కూడా 'అనివార్య కారణాల వలన' అంటూ పనులు నిలిపివేయడం, కాలపరిమితి పెంచడం లాంటివి చేయొచ్చు. ఇలాంటివి జరక్కుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. అప్పుడే ప్రజలు విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నమ్ముతారు. ప్రస్తుతం టెండర్లను ఆహ్వానించి దక్షిన కోస్తా రైల్వే జోన్ కార్యాలయాలను రూ. 149.16 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. గతంలో రైల్వేశాఖకు ఏపీ ప్రభుత్వం కేటాయించిన ముడసర్లోవలోని 52 ఎకరాల స్థలంలోనే ఈ నిర్మాణాలు జరగనున్నాయి. రిజర్వాయర్ పక్కనే ఉండటంతో ఏమైనా ఇబ్బందులు వస్తాయేమోనని గతంలో రైల్వేశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అయితే అటువంటి ఇబ్బందేమీరాదని రాష్ట్రప్రభుత్వం స్పష్టతనివ్వడంతో ఇప్పుడు ఆ భూములను ఖరారు చేసింది. మొత్తం 11 అంతస్తుల్లో భవన నిర్మాణం జరగనుంది. ఇందులో రెండు సెల్లార్ పార్కింగ్ ఎ÷-లోర్లు ఉంటాయి. క్కడ దక్షిణ కోస్తా జోన్ జనరల్ మేనేజర్ కార్యాలయం, ఇతర ఉన్నతాధికారుల ఆఫీసులు ఉంటాయి. జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలంటే ఒక జనరల్ మేనేజర్, ఆయన సపోర్టింగ్ స్టాఫ్ కొన్ని కార్యాలయాలు ఉంటే చాలు. మొత్తంగా దీనికి 2 వేల మంది ఉద్యోగులు అవసరమవుతారు. పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి వారి సంఖ్య క్రమంగా 3 వేలకు చేరుతుంది. ఇప్పటికే ఇక్కడ పని చేస్తున్న వారు కొందరు ఉన్నారు కాబట్టి, చాలా తక్కువ మంది ఉద్యోగులు కొత్తగా అవసరమవుతారు. వీరందరూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్, కంట్రోల్ రూం, అడిటోరియం, మెకానికల్.. ఇలా మొత్తం 18 రకాల విభాగాలు, దానికి సంబంధించిన అనుబంధ కార్యాలయాలలో పని చేస్తుంటారు. మొత్తానికి త్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఇప్పటికైనా సాకారమవటం హర్షనీయం. దానీ కేసుపై ఏపీలో ఎందుకింత నిశ్శబ్దం




హయాంలో చాయ్, సమోసాల కోసం పెట్టిన ఖర్చు మీదే నానా రచ్చ చేస్తున్న తెలుగుదేశం నేతలు, అదానీ – జగన్ వివాదంలో ఎందుకు సైలెంట్ గా ఉన్నారనేది ఆసక్తిని రేపుతోంది. అసెంబ్లీలో మొక్కుబడిగా అది కూడా అదానీ ప్రస్తావన లేకుండా చంద్రబాబు చేసిన ప్రకటన తప్ప తెలుగుదేశం నేతల నుంచి సౌండ్ లేదు. దేశంలోనే ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారంటూ అమెరికాలో కేసు నమోదైంది. అమెరికాలో పెట్టుబడిదారుల నుంచి సేకరించిన డబ్బును భారత్‌లోని వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలకు లంచాలు ఇచ్చేందుకు వినియోగించారనేది ప్రధాన ఆరోపణ. ఆ లంచాల్లో 80 శాతానికి పైగా అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తికి ఇచ్చినట్టు కూడా అందులో పేర్కొన్నారు. నిర్దిష్టంగా చెప్పుకుంటే సోలార్ విద్యుత్ ఒప్పందాల కాంట్రాక్టులను దక్కించుకునేందుకు దేశంలోని ఐదు రాష్ట్ర ప్రభుత్వాలకు 2,029 కోట్ల రూపాయలు లంచాలు ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్‌లోని గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోని కీలక వ్యక్తికి ఒక్కరికే 1,750 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు అమెరికా ప్రాసిక్యూటర్ ఈ కేసుపత్రాల్లో పేర్కొన్నారు. చిన్న విషయాలకే అగ్గి బుగ్గి అన్నట్టుండే ఆంధ్ర రాజకీయాల్లో ఎంత వివాదం రేగాలి? ఎంత చర్చ రచ్చ ఉంటుందనుకోవాలి? కానీ అటువంటిదేమీ లేదు. తప్పదన్నట్టు అసెంబ్లీలో ముక్తసరిగా మాట్లాడి ముగించిన చంద్రబాబు రెస్పాన్స్ తప్ప, రాష్ట్ర అసెంబ్లీలో ఒక్క సీటు కూడా లేని కాంగ్రెస్ స్పందన తప్ప ముఖ్యమైన పార్టీల నుంచి అంతులేని సైలెన్స్.దానీ ఎపిసోడ్, అందులోనూ ఆంధ్రతో ఉన్న బంధం గురించి జాతీయ స్థాయి మీడియాలో చర్చ జరుగుతున్న వేళ అసెంబ్లీలో చంద్రబాబు క్లుప్తంగా స్పందించారు. జగన్ మీద ఎప్పుడూ మాట్లాడే ఆరోపణలకే పెద్దపీట వేసి అదానీ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీకి గౌతమ్ అదానీ అత్యంత దగ్గరి వ్యక్తి. ఇక ఎన్‌డీఏలోనూ చంద్రబాబు ఉన్నారు. నరేంద్ర మోడీతో ఆయన రాజకీయ సావాసం చేస్తున్నారు. ఇటు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలోనూ టీడీపీ, బీజేపీలు భాగస్వాములు. ఇప్పుడు అదానీ మీద ఆరోపణలు చేస్తే నరేంద్ర మోదీ మీద మాట్లాడినట్లే అనుకోవచ్చు. అందువల్ల చంద్రబాబు నాయుడు అదానీ ఇష్యూ గురించి మాట్లాడేందుకు పెద్దగా ఇష్టపడటం లేదనిభావించాలి. చంద్రబాబు నాయుడు మౌనంగా ఉండటానికి మరొక కారణం కూడా ఉంది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం సంక్షేమంపై దృష్టి పెడితే, ఇప్పుడు చంద్రబాబు పారిశ్రామిక రంగంపై దృష్టి సారించినట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో చాలా చోట్ల అదానీ గ్రూప్ పెట్టుబడులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు నుంచి ఈ విషయంపై తీవ్రంగా స్పందన ఆశించలేం. మొత్తంగా ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి, అటు ప్రధాని నరేంద్ర మోదీకి ఇబ్బంది కలగకుండా ఉండటానికి చంద్రబాబు నాయుడు నామమాత్రంగా స్పందించారని అనుకోవచ్చు. ఏదేమైనా అదానీ ముడుపుల కేసు విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇబ్బందికర పరిస్థితిలో ఉన్నారు. ఆయన రాజకీయ ప్రత్యర్థి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 1,750 కోట్ల రూపాయలు అదానీ నుంచి డబ్బులు తీసుకుందని చంద్రబాబు నాయుడుకు వకాల్తా పుచ్చుకునే మీడియా సంస్థలు వార్తలు ప్రచురిస్తున్నాయి. కానీ చంద్రబాబు గట్టిగా మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. ఎందుకంటే జగన్ గురించి మాట్లాడితే అదానీ గురించి మాట్లాడినట్టే.. అంటే అది నరేంద్ర మోడీ గురించి మాట్లాడినట్టే. ఇది బాబుకు ఇరకాటమే. వాస్తవంగా చూస్తే చంద్రబాబు సీరియస్‌గానే స్పందించాలి. ఎందుకంటే ఆ ఆరోపణ చిన్నది కాదు. గత ప్రభుత్వంలోని కీలక అధికారి తీసుకున్నారన్నది నిజమే అయితే అది ప్రజల సొమ్ము.. ఈ విషయమై చంద్రబాబు కేసు కూడా పెట్టొచ్చు. కానీ అదానీకి దెబ్బ తగిలితే భారత ఆర్థిక వ్యవస్థకు దెబ్బ తగిలినట్లుగా భావిస్తున్న బీజేపీతో బాబు కలిసి ఉండటం వల్ల అదానీ వ్యవహారంలో ఆయన ఇరకాటంలో పడ్డారు. ఈ ఆరోపణల మీద వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎక్కడా నేరుగా స్పందించలేదు. ఆ ఆరోపణలు వచ్చిన మరుసటి రోజు ఆయన బెంగళూరుకు వెళ్లిపోయారు. ఆదానీ ముడుపులు ఇచ్చినట్టు మీడియాల్లో వచ్చిన వాదనలు, వార్తలపై పార్టీ పరంగా వివరణ, ఖండన మాత్రం నాలుగురోజుల కిందటే వెలువడింది. ఆ తర్వాత మాజీ మంత్రి పేర్ని నాని మీడియా సమావేశం నిర్వహించి వివిధ మీడియాల్లో వస్తున్న కథనాలను, వార్తలను ఖండించారు.



# ఐఐటీ బాంబే విద్యార్థి అరెస్టు

### అతని ఎకౌంట్ నుంచి రూ.7.29 లక్షలు మాయం

ముంబై, నవంబర్ 27: ఐఐటీ ముంబై విద్యార్థి దారుణంగా మోసపోయాడు. అతని వద్ద నుంచి డిజిటల్ అరెస్టుతో రూ.7.29 లక్షలు కాజేశారు. ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెబుతూ ఓ వ్యక్తి అతన్ని బెదిరించాడు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల్లో డిజిటల్ అరెస్టులు ఎక్కువగా జరుగుతున్న విషయం తెలిసిందే. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది జూలైలో ఓ గుర్తు తెలియని నెంబర్ నుంచి 25 ఏళ్ల స్టూడెంట్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ట్రాయ్ ఆఫీసు నుంచి కాల్ చేస్తున్నామని, మొబైల్ నెంబర్‌పై 17 ఫిర్యాదులు ఉన్నాయని అతను బెదిరించాడు. అయితే నెంబర్‌ను డీయాక్టివేట్ చేయకుండా ఉండేందుకు .. పోలీసుల నుంచి ఎన్వోసీ సర్టిఫికేట్ అవసరం ఉంటుందని ఆ ఉద్యోగి స్టూడెంట్‌కు చెప్పాడు. ఫోన్ కాల్‌ను సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు అతను చెప్పాడు. ఆ తర్వాత వాట్సాప్ కాల్‌లో ఓ వ్యక్తి పోలీసు ఆఫీసర్ దుస్తుల్లో కనిపించాడు. బాధితుడి ఆధార్ నెంబర్ అడిగాడతను. ఆ నెంబర్ నుంచి మనీల్యాండరింగ్ జరుగుతున్నట్లు ఆరోపించాడు. యూపీఐ ద్వారా 29 వేలు ట్రాన్స్‌ఫర్ చేసేలా విద్యార్థిని వత్తిడి చేశాడు. ఆ తర్వాత డిజిటల్ అరెస్టు చేసిన విద్యార్థిని ఎవరితో కాంటాక్టు కాకుండా చేశాడు. తర్వాత రోజు ఫోన్ చేసి మరిన్ని డబ్బులు డిమాండ్ చేశాడు. ఆ సమయంలో బాధితుడు తన బ్యాంక్ వివరాలను వెల్లడించాడు. అప్పుడు అతని అకౌంట్ నుంచి ఏడు లక్షలు కాజేశారు. డబ్బులు తీసుకున్న తర్వాత.. ఇక ఎటువంటి అరెస్టులు ఉండవని స్టూడెంట్‌కు నిందితుడు భరోసా ఇచ్చాడు. డిజిటల్ అరెస్టు గురించి ఆన్‌లైన్‌లో తెలుసుకున్న తర్వాత.. ఆ విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ప్రభుత్వాలపై ఎందుకింత వ్యతిరేకత!

ఏడాది ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఎన్నికలు జరిగిన పది ప్రధాన దేశాల్లో ఓటర్ల ఆగ్రహమే ఫలితాల్లో కనిపించింది. అమెరికా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, అజంటీనా, సోలమన్ ఐలాండ్స్, తైవాన్, ఇండోనేసియా... తో పాటు ఈ ఏడాది మరో 50కి పైగా దేశాల మధ్యా ఓ అరుదైన సారూప్యత ఏర్పడింది. అది, ఈసారి ఎన్నికలకు వెళ్లిన దేశాల్లో 80శాతం ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. ఈ ఏడాది 70కి పైగా దేశాలు ఎన్నికల పరీక్షకు నిలవడంతో 2024ను ప్రజాస్వామ్య సంవత్సరంగా అభివర్ణించారు. భారత్, అమెరికా, యూకే, యూరోపియన్ యూనియన్, జపాన్, రష్యాలాంటి అనేక చోట్ల ఈ ఏడాది ఎన్నికలు జరిగాయి. అంటే... ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ మంది తమ మనసులో మాట వినిపించే సంవత్సరంలా నిలిచిందీ 2024. అయితే ఈ దేశాల్లోని మానవాళి మాత్రం తాము 'బతకలేకపోతున్నాం... పరిస్థితులను మార్చండి... పాలనను మెరుగు పర్చండి' అని నినదించింది. ఖండాలు, దేశాలు, పార్టీలు, నాయకులు, సంస్కృతులు వేరైనా అన్ని దేశాల్లోనూ ప్రజల రియాక్షన్ ఒక్కటే. అమెరికా నుంచి ఇండోనేసియా దాకా ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల తీర్పుల అంతరార్థం ఇదే! మరికొన్ని రోజుల్లో సంవత్సరం ముగుస్తున్న దశలో... అనేక దేశాల్లో ఎన్నికలు ముగిశాయి. వీటిలో కేవలం 20శాతం దేశాల్లో మాత్రమే పార్టీలు అధికారాన్ని నిలబెట్టుకున్నాయి. మిగిలిన అన్ని చోట్లా అధికారంలో ఉన్నవారికి ప్రజలు చుక్కలు చూపించారు. వ్యతిరేక ఓటుతో గ్దదె దించారు. యూకేలో దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీని ఇంటికి పంపించారు. న్యూజిలాండ్‌లో లేబర్ పార్టీ, జపాన్‌లో ఎల్‌డీపీ, దక్షిణాఫ్రికాలో ఏఎన్సీ, తాజాగా అమెరికాలో డెమోక్రాట్లను తిరస్కరించారు. దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా పార్టీ ఏఎన్సీ... తొలిసారి ఘోర పరాజయం పాలైంది. అమెరికాలో అధికారంలో ఉన్న పార్టీ వరసగా ఓడిపోవటం వందేళ్లలో ఇదే తొలిసారి. ఒబామా తర్వాత డెమోక్రాట్లు, ట్రంప్ తర్వాత రిపబ్లికన్లు, మళ్లీ ఇప్పుడు బైడెన్ తర్వాత డెమోక్రాట్లు ఓడిపోయారు. నాలుగేళ్ల కిందట వద్దనుకున్న, అనేక కేసులు ఎదుర్కొంటున్న డొనాల్డ్ ట్రంప్‌నే మళ్లీ అమెరికా ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించుకున్నారంటే వారిలో ప్రస్తుత ప్రభుత్వ తీరుపై ఎంత వ్యతిరేకత గూడుకట్టుకుందో తెలిసిపోతోంది. సరిహద్దులను చెరిపేసుకొని ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ఈ ట్రెండ్ చెబుతున్నదేంటి? భౌగోళిక రాజకీయాలు, యుద్ధాలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, వలసలు... అన్నీ కలిసి రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు, అస్తవ్యస్త పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అవి అన్ని దేశాల్లోనూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. మరోవైపు ఉద్యోగాలు ఊడుతుండటం, జీతాలు తగ్గుతుండటం... ప్రజలను అనిశ్చితిలోకి నెట్టాయి. ఫలితమే ప్రభుత్వాలపై వ్యతిరేకత! ప్రపంచవ్యాప్త వ్యతిరేకత! మరి కొత్త నాయకత్వాలు ప్రజల తీర్పును ఎంతవరకు గౌరవిస్తాయనేది చూడాల్సివుంది.

# ప్రభుత్వ ఏర్పాటులో మహాయుతి విఫలం

### శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు

మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా తేలలేదు. నాలుగు రోజులుగా ఈ అంశంపై తీవ్రంగా చర్చ నడుస్తోంది. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటులో మహాయుతి కూటమి విఫలమైందని విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను అమలు చేయాలన్నారు . 'అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి భారీ మెజారిటీ వచ్చింది. నవంబర్ 26వ తేదీతో శాసనసభ పదవీకాలం కూడా ముగిసింది. అయినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతోంది. ఇప్పటి వరకూ ముఖ్యమంత్రిని కూడా నిర్ణయించలేదు. మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం అనే పరిస్థితి వచ్చినప్పుడు 26వ తేదీలోగా ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే రాష్ట్రపతి పాలన విధించాలి' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి



భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు గానూ.. బీజేపీకి 132, శివసేనకు 57, ఎన్సీపీకి 41 స్థానాలు లభించాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి మార్గం సుగమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే మంగళవారం రాజీనామా చేశారు. కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టేవరకూ ఆపద్ధర్మంగా కొనసాగాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ షిండేను కోరారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215